క్లుప్తంగా

'పవర్ ద ఫ్యూచర్'పై సెమినార్



డాక్టర్ రామకృష్ణను సత్కరిస్తున్న వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం, ఐఈఈఈ–పవర్ ఎనర్జీ సొసైటీ ఆధ్వర్యాన 'పవర్ ద ఫ్యూచర్' అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆసియా పసిఫిక్ రీజియన్ ప్రతినిధి డాక్టర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు. ఐఈఈఈ ద్వారా స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ ఉపయోగించడం వలన కెరీర్ పరిశోధన రంగాల్లో ఉండే అవకాశాలను వివరించారు. ఐఐటీలతో ఐఈఈఈకి ఉన్న ఎంఓయూ మాదిరిగానే జేఎన్‌టీయూకేతో ఇంటర్న్‌షిప్ అందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. 150 దేశాలు, 4 లక్షలకు పైగా సభ్యులున్న అంతర్జాతీయ సొసైటీగా ఐఈఈఈ విస్తరించిందన్నారు. అనంతరం వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు డాక్టర్ కె.రామకృష్ణను సత్కరించారు. ఐఈఈఈ ప్రతినిధి కె.సంతోష్, ఈఈఈ విభాగాధిపతి రవీంద్ర పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడు పాల్‌రాజుకు సత్కారం



పాల్‌రాజ్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

బాలాజీచెరువు: రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి గురువారం అమరావతిలో తన కార్యాలయంలోని కాజులూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు కె.పాల్‌రాజును సత్కరించారు. యూట్యూబ్‌లలో 1200 వీడియోలు చేసి ఆంగ్లభాష అభివృద్ధికి కృషిచేసిన సందర్భంగా సత్కరించారు. అలాగే ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లతో పాటు, రాష్ట్ర విద్యాపరిశోధన సంస్థ వెబ్‌సైట్, మన–బడి, దూరదర్శన్ వంటి ఏడు మల్టీమీడియా ప్లాట్‌ఫార్మ్‌లో ఈ వీడియోలు ఉంచుతామని ప్రతాప్‌రెడ్డి తెలిపినట్టు పాల్‌రాజ్ తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

బోట్‌క్లబ్: వర్షాలతో నష్టపోయిన రైతులను ఇబ్బంది పెట్టవద్దని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు యార్లగడ్డ రామ్‌కుమార్ అన్నారు. కాకినాడలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిబంధనలు పూర్తిగా సవరించి ప్రతి గింజ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ శాతంతో సంబంధం లేకుండా రైతులకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. ప్రస్తుత అకాల వర్షాల వల్ల జిల్లాలో సుమారు లక్షమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వమే వీరిని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

డ్రెయిన్లలో తూడు, గుర్రపు డెక్క వెంటనే తొలగించాలి



కరపలో ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ స్వప్న

కరప: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్లలో నీరుపోయేలా వెంటనే ఉపాధిహామీ పథకం ద్వారా తూటుకాడ, గుర్రపుడెక్కను తొలగించే పని చేయించాలని ఎంపీడీఓ కర్రె స్వప్న సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె ఉపాధి పథకం ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బందితో సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. సోమవారం నుంచి నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉపాధికూలీలను తీసుకువచ్చి, పనులు చేయించాలన్నారు. మండలంలో ప్రతిరోజూ 4,441 మంది ఉపాధికూలీలకు పనులు చెప్పాల్సి ఉందన్నారు. ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.272 లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ స్వప్న సూచించారు. ఏపీఓ ఇ.వెంకటరమణ, ఏఒ గుత్తుల భీమశంకర్రావు, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, జేఈ వై.నాగలోవ, టెక్నికల్ అసిస్టెంట్లు టి.రాజేంద్ర, కె.ప్రకాష్, సీఓలు ఎన్.రాజ్యలక్ష్మి, కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈటీసీలో టీఓటీలకు శిక్షణ

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శుల పనితీరు మరింత మెరుగుపడేలా శుక్రవారం నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం (ఈటీసీ) మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్యాచ్‌కు 40 మంది చొప్పున మూడు బ్యాచ్‌లలో 120 మంది టీఓటీలకు శిక్షణ ఉంటుందన్నారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓ పీఆర్డీలను టీఓటీలుగా ఎంపిక చేశామన్నారు. శుక్రవారం పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళంలోని టీఓటీలకు శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. శిక్షణ పొందిన టీఓటీలు ఆయా జిల్లాలకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు భరోసా
- తడిసినా, రంగు మారినా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



వాకాడలో వర్షాలకు తడిసిపోయి మొలకలు వస్తున్న వరి పనలను ఎమ్మెల్యే కన్నబాబుకు చూపిస్తున్న రైతులు, నాయకులు

కరప: నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రబీ పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కురసాల కన్నబాబు భరోసా ఇచ్చారు. మండలం వాకాడలో గురువారం స్థానిక నాయకులు, అధికారులతో కలసి పర్యటించి తడిసి మొలకలు వచ్చిన ధాన్యం రాశులను, వరి పనలను, దెబ్బతిన్న పంటపొలాలను ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తడిసినా, రంగుమారినా ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం జగన్ ఆదేశాలు ఇచ్చారని, దళారులకు అయినకాడికి అమ్ముకోవద్దని పేర్కొన్నారు. ఆర్బీకేల ద్వారా కొనేలా అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో పంటనష్టం జరిగితే వ్యవసాయాధికారులు చెప్పిన లెక్కలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. కరప మండలం శివారున ఉంటుందని, నీటికట్టుడుకి కడన, ముంపుకు ముందు ఉంటుందని, అటువంటి సున్నితమైన మండలంపై నిర్లక్ష్యం వహించకుండా పంటనష్టంపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ధాన్యం రాశులు తడిసిపోయి మొలకలు వచ్చాయని, కోసినచేలు ముంపునకు గురయ్యాయని ఆదుకోవాలని రైతులు వివరించారు. ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించైనా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు రైతుల వెన్నంటే ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. రైతు కళ్లం నుంచే జేసీ ఇలక్కియా, సివిల్‌సప్లై అధికారి డి.పుష్పమణి, ప్రత్యేకాధికారి అడపా వెంకటలక్ష్మి తదితర అధికారులకు ఎమ్మెల్యే ఫోన్‌చేసి మండలంలో పంట పరిస్థితిని, జరిగిన నష్టాన్ని వివరించి, వెంటనే రైతుల నుంచి ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో అకాల వర్షాలకు సుమారుగా 3,160 ఎకరాలల్లో పంటనష్టం వాటిల్లిందన్నారు. 1200 ఎకరాల్లో వరిచేలు పడిపోయి దెబ్బతిన్నాయని, 1700 ఎకరాల్లో పనలపై ఉన్న పంట ముంపునకు గురైందన్నారు, మరో 260 ఎకరాలు ముంపుకు గురయ్యాయన్నారు. రైతులను అప్రమత్తం చేసేందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించినట్టు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు చక్కపల్లి ఫకీర్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల ప్రసాద్, బుచ్చిరాజు, బండే తాతాజీ, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వాకాడలో రైతు కళ్లం నుంచి జేసీకి ఫోన్‌చేసి కమీషన్ వ్యాపారి అన్యాయాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కౌలు రైతుకు ఊరట

ఈ సందర్భంగా కౌలురైతు లకమని అమ్మిరాజు ఎమ్మెల్యే కన్నబాబుకు ధాన్యం చూపించి, కమీషన్ వ్యాపారి 75 కిలోల బస్తా రూ.1,050 లకు కొనుగోలు చేయడానికి ఒప్పుకుంటే రూ 300 బస్తాలు అమ్మామని, తీరా రైసు మిల్లుకు వెళ్లిన తర్వాత రూ.900 ఇస్తానంటున్నారని, ఆదుకోవాలని కోరాడు. ఎమ్మెల్యే స్పందించి జేసీ, సివిల్‌సప్లై అధికారులకు ఫోన్‌చేసి చెప్పి, రైతు నుంచి మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జేడీఏ ఎన్.విజయ్‌కుమార్ వాకాడ వచ్చి రైతు నుంచి వివరాలు తీసుకుని, చెల్లూరులోని రైసు మిల్లుకు ఫోన్‌చేసి, పట్టుకెళ్లిన ధాన్యాన్ని వెనక్కితీసుకొచ్చి, ఆర్బీకే ద్వారా స్థానిక జానకిరామా రైసుమిల్లుకు పంపించారు. ఎంఏఓ రాజేష్ ధాన్యం అన్‌లోడింగ్ అయ్యేవరకు రైసుమిల్లు వద్దనే ఉన్నారు. కమీషన్ వ్యాపారి బారిన పడకుండా, ఆదుకున్నందుకు కౌలు రైతు అమ్మిరాజు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపాడు.

కళ్లాల్లో ధాన్యం పరిశీలన



పెనుగుదురులో కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ సీతారామారావు

కరప: మండలం పెనుగుదురులో గురువారం కాకినాడ ఇన్‌చార్జి ఆర్డీఓ జె.సీతారామారావు పర్యటించి లే అవుట్లలోని ధాన్యం కళ్లాలను పరిశీలించారు. రైతులు ధాన్యం మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. దళారీల మాయమాటలు నమ్మకుండా వ్యవసాయ, రెవెన్యూ అధికారులను, ఆర్బీకేలను సంప్రదించి తగిన సలహాలు తీసుకుని, ధాన్యం విక్రయించాలని ఇన్‌చార్జి ఆర్డీఓ సీతారామారావు సూచించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు, వీఆర్వో పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంగీతానికి మూల విరాట్ త్యాగరాజస్వామి



పద్మావతిని సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ ప్రతినిధులు

కాకినాడ రూరల్: కర్ణాటక సంగీతానికి మూలవిరాట్ అయిన త్యాగరాజ స్వామి అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోశారని విద్వాన్ టి.పద్మావతి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మావతి మాట్లాడుతూ తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగరాజస్వామిలో మూర్తీభవించాయని అన్నారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా భగవదారాధనకు ఒక సాధనగా ఆయన వినియోగించారని ఆమె అన్నారు. 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి స్వీయానుభవ భావనలే కృతి రూపంలో గాంధర్వ గాన మధురానుభూతిగా లోకానికి అందించారని అన్నారు. ఈ సందర్భంగా పద్మావతి త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో పద్మావతిని ఘనంగా సత్కరించారు. తొలుత త్యాగరాజస్వామి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, రేలంగి బాపిరాజు, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై భావనారాయణస్వామి



అశ్వ వాహనంపై ఊరేగుతున్న భావనారాయణస్వామి

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్వామివారిని గ్రామ వీధుల్లో అశ్వవాహనంపై ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా మహేంద్రవాడ నరసింహమూర్తి బృందం శాస్త్రీయ సంగీతాన్ని ఆలపించారు. ఆలయ అధికారులు, పాలకమండలి ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు స్వామివారికి సముద్ర స్నానం నిర్వహించేందుకు ఊరేగింపుగా సూర్యారావుపేట బీచ్‌కు తీసుకువెళ్తామని అక్కడ చక్రస్నానం చేయించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తామని ఆలయ చైర్మన్ నారాయణరావు కోరారు.

కాకినాడలో త్వరలో శతకోటి కుంకుమార్చన

- పరిపూర్ణానంద స్వామీజీ
- ఎమ్మెల్యే కన్నబాబుకు సత్కారం



శ్రీపీఠంలో ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న పరిపూర్ణానందస్వామి

కాకినాడ: వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో కాకినాడలో శతకోటి కుంకుమార్చన, కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్టు శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ పేర్కొన్నారు. రమణయ్యపేటలోని శ్రీపీఠాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబును స్వామీజీ శాలువాతో సత్కరించారు. అనంతరం శతకోటి కుంకుమార్చన గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వ, తమ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని స్వామీజీకి కన్నబాబు తెలిపారు. అనంతరం మీడియాతో పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ వైశాఖపౌర్ణమిని పురస్కరించుకుని శ్రీపీఠాన్ని ఎమ్మెల్యే కన్నబాబు సందర్శించారన్నారు. శ్రీపీఠంలో త్వరలో చేపట్టనున్న శతకోటి కుంకుమార్చన, కోటి దీపోత్సవం గురించి వివరించి సహకారం కోరామన్నారు. కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, రాష్ట్ర హిస్టరీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లకోటేశ్వరరావు, గోపిశెట్టి బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహ జయంతి



ప్రత్యేక అలంకరణలో నృసింహ స్వామి

బోట్‌క్లబ్: స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలోని సత్యదేవ మందిర ప్రాంగణంలో గురువారం నృసింహ జయంతి నిర్వహించారు. మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో నృసింహ పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్తరాధి మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామిజీ అనుగ్రహంతో జ్ఞానయజ్ఞ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రాజీవ్ గృహకల్ప అభివృద్ధికి చర్యలు



రాజీవ్ గృహకల్ప ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ డైరీఫారం సెంటర్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా గురువారం స్థానిక 11వ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని సందర్శించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ గడిచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే ద్వారంపూడి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా 17 ఏళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్లు కొన్నిచోట్ల పగుళ్లు ఏర్పడి అక్కడక్కడ శిథిలమయ్యే పరిస్థితికి చేరుకున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ రాజీవ్ గృహకల్పలో నివసించే స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే నగరపాలక సంస్థ కమిషనర్‌తో చర్చించి ఆ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనపై కూడా అధికారులతో చర్చిస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, మెర్ల వరలక్ష్మి, గద్దేపల్లి దాసు, బారం ప్రసాద్, అలుగోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విజ్ఞానంపై శిక్షణ



కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్న లక్ష్మీదుర్గా భవాని

సామర్లకోట: మాధవపట్నం శివారు జమునానగర్‌లో జనవిజ్ఞాన వేదిక, బాలమందిరం ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. బాలమందిరం ఫ్యాకల్టీ అంగర లక్ష్మీదుర్గ భవానీ కంప్యూటర్ ప్రాథమిక శిక్షణ నిర్వహించారు. బాలల పత్రిక, చిట్టి ఊహలు, అంశాలపై అవగాహన కల్పించారు.

కార్పొరేషన్ వాహనాలకు జీపీఎస్

- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం
- వెహికల్ యార్డు సందర్శన



యార్డులోని వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: పారిశుధ్య, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ పరిధిలో పనిచేసే ప్రతి ఒక్క వాహనానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ ఎం.వెంకట్రావు, ఇతర అధికారులతో కలిసి బొందగుంటలోని వెహికల్ యార్డును సందర్శించారు. అక్కడ ఉన్న కంపాక్టర్లు, జేసీబీలు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు సహా మొత్తం 59 వాహనాలు నిలిపే ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా వాహనాల ఆవశ్యకత దృష్ట్యా అన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ఈ వాహనాల కదలికలు, సమయవేళలను ఎప్పటికప్పుడు గుర్తించి పర్యవేక్షించేందుకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చడం వల్ల ప్రజలకు మరిన్ని సేవలు అందించగలమని కమిషనర్ పేర్కొన్నారు. వాహనాలపై పనిచేసే డ్రైవర్లు, ఉద్యోగులు మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కమిషనర్ ఏఈ విరూపాక్షం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ తదితరులు ఉన్నారు.

బీమా.. కర్షకుడికి ధీమా

- ప్రకృతి కన్నెర్రజేస్తే ఆదుకునే పరిహారం
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా మంజూరు
- రైతుకు, కౌలుదారుకు రక్షణ కవచం



కరప: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రకృతి వివిధ రూపాల్లో తన్నుకుపోతుంటే అన్నదాతను ఆదుకునేవి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు. జరిగిన నష్టం నుంచి తేరుకోవాలంటే వీటిని తమ పనిలో భాగం చేసుకుని క్రమం తప్పకుండా సంబంధిత అధికారులను సంప్రదించి ఉపశమనం పొందవచ్చు. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఉండేదికాదు. పంటల బీమా కూడా రైతులు పీఏసీఎస్‌లలో కానీ, వాణిజ్య బ్యాంకులలో కానీ తీసుకున్న పంట రుణాలకు బీమా ప్రీమియం కట్టించుకునేవారు. అధిక వర్షాలకు, తుపాన్లకు పంటపొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లితే పంట రుణం తీసుకున్న రైతులకే బీమా వర్తించేది. బ్యాంకులు, సొసైటీల్లో తీసుకున్న రుణాన్ని బట్టి బీమా శాతం లెక్క కట్టేవారు. కౌలు రైతుకు ఒక్క రూపాయి కూడా ముట్టేది కాదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వ్యవసాయం లాభసాటిగా చేయాలన్న సంకల్పం, ప్రకృతి వైపరీత్యాలు వస్తే రైతులను ఎలా ఆదుకోవాలో ఆలోచించి రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేశారు. రైతులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా ప్రభుత్వమే రైతుల తరఫున చెల్లించి, ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. సాగు ప్రక్రియలో ఏ దశలో వైపరీత్యాలు సంభవించి నష్టం వాటిల్లినా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి రైతులను ఆదుకుంటున్నారు.

ఈ–క్రాప్, ఈ–కేవైసీ తప్పనిసరి

రైతుకైనా, కౌలు రైతులకైనా ఇన్‌పుట్ సబ్సిడీ రావాలన్నా, పంటల బీమా మంజూరు కావాలన్నా ముందుగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఆర్బీకే ద్వారా వీఏఏ లాగిన్‌లో రైతు తన వివరాలతో ఈ–క్రాప్ నమోదు చేయించుకుని, ఈ–కేవైసీ చేయాలి. ఆ తర్వాత వీఆర్‌ఓ దానిని నిర్ధారించాలి.

ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేదిలా..

ప్రకృతి విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని రైతు సదరు వివరాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలి. ఆ మేరకు వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టం నమోదు చేసి, ప్రభుత్వానికి నివేదిస్తారు. 33 శాతానికి పైబడి నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది.

పంటల బీమా ఇచ్చేదిలా..

పంటల బీమా రావాలంటే గతంలో మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఇచ్చేవారు. దీనివల్ల అన్నదాతకు అంతగా ఉపయోగం ఉండేదికాదు. ఇప్పుడు ఆర్బీకేలో ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతుకు, కౌలు రైతుకు కూడా నష్టం వాటిల్లితే పంటల బీమా వర్తింపచేస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఈ బీమా నిర్ణయిస్తున్నారు. అంటే ఒక సీజన్‌లో పంట పండించడానికి ఎంత పెట్టుబడి అవుతుందో లెక్కలు కట్టి, బ్యాంక్‌లు, సొసైటీల ద్వారా ఆ మేరకే పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో కోతలకు ముందు నాలుగు పంటకోత ప్రయోగాలు చేస్తారు. అది కూడా కంప్యూటర్ ద్వారా ఆ గ్రామంలో ర్యాండమ్‌గా నాలుగు సర్వే నంబర్లు ఎంపిక చేసి, వ్యవసాయ శాఖకు తెలియజేస్తారు. ఏయే సర్వే నంబర్లలో పంటకోత ప్రయోగాలు చేయాలో సమాచారం వచ్చిన తర్వాత.. పంట కోతకు వచ్చిన వెంటనే వ్యవసాయాధికారులు ఆయా ప్రాంతాల్లో 5 చదరపు అడుగుల విస్తీర్ణంలో పంట కోసి, వచ్చిన ధాన్యం బరువు తూచి, తేమ శాతం తీసి ఎకరాకు ఎన్ని బస్తాలు (75 కిలోలు) దిగుబడి వస్తుందో లెక్క కడతారు. నాలుగు చోట్ల వచ్చిన సరాసరి దిగుబడిని యాప్‌లో రైతు పేరున నమోదు చేస్తారు. మండల పరిధిలోని గ్రామాల వారీగా వచ్చిన దిగుబడిని కలెక్టరేట్‌లోని స్టాటిస్టిక్స్ విభాగానికి, అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదిస్తారు. పంట దిగుబడి రావాల్సిన సగటు కంటే తక్కువగా వస్తేనే పంటల బీమా వస్తుంది. ఏ గ్రామంలో సగటు కంటే ఎంతమేర దిగుబడులు తగ్గాయో లెక్క కట్టి, ఒక ఎకరానికి మంజూరు చేయాల్సిన బీమా శాతాన్ని నిర్ణయిస్తారు. దాని ప్రకారం రైతుకు ఉండే విస్తీర్ణాన్ని బట్టి ఆయా గ్రామంలో జరిగిన నష్టతీవ్రతను బట్టి పంటల బీమా వస్తుంది.

బయటపడిన ఉపాధి సిబ్బంది బాగోతం

- బినామీ పేర్లతో మస్తర్ల సొమ్ము స్వాహా
- కూలీలు రాకుంటే బయట కూలీలతో పనులు
- వేట్లపాలెంలో సిబ్బందిపై ఆరోపణలు

సామర్లకోట: మండల పరిధిలో మేజర్ పంచాయతీ వేట్లపాలెం ఉపాధి సిబ్బంది అవినీతి గురువారం బయట పడింది. గ్రామానికి చెందిన బి.వీరవెంకట సత్యనారాయణ ఉపాధి హామీ సిబ్బంది అవినీతిపై విచారణ చేయాలని ఇటీవల డ్వామా పీడీ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గత పాలకుల సూచనల మేరకు ఉపాధి హామీలో అవకతవకలు జరిగాయని ఆయన ఫిర్యాదు చేశాడు. దాంతో డ్వామా ఏపీడీ వసంత మాధవి ఆధ్వర్యంలో సుమారు నాలుగు గంటల పాటు పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేశారు. గ్రామంలోని ఉపాధి హామీ మేట్లు బినామీ పేర్లతో మస్తర్లు వేసి సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. ఈ మేరక ఏపీడీ ఉపాధి హామీ మేట్లను ప్రశ్నించగా ఉపాధి హామీ కూలీలు రాని సమయంలో బయట కూలీలతో పని చేయించినట్లు మేట్లు కొంతమంది మేట్లు అంగీకరించారు. అలాగే ఉపాధిహామీ నిధులతో గ్రామంలోని పేదలకు మరుగుదొడ్లు నిర్మించకుండా నిధులు స్వాహా చేశారని ఉపాధి కూలీలు, గ్రామస్తులు ఆరోపించారు. మరుగుదొడ్లకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినట్టు ఉండటంతో ప్రస్తుతం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు నుంచి రుణం రావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. ఉపాధి హామీ మేట్లపై చర్య తీసుకోవడానికి పీడీ దృష్టికి తీసుకువెళ్తామని వసంత మాధవి తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి శ్రీలలిత, ఏపీఓ ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి బాబ్జీ, నిడదవోలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.